క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సహకరించాలి

చందోలు(పిట్టలవానిపాలెం): గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చందోలు గ్రామ సర్పంచి గౌరీదేవి విజయకుమారి మునీర్ కోరారు. మండలంలోని చందోలు -1 గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తుందని తెలిపారు. వీఆర్వో అరుణ మాట్లాడుతూ గ్రామంలో ఈనెలాఖరు నాటికి భూములు రీ సర్వే ప్రక్రియ జరగనుందని ఈలోపు చందోలు రెవెన్యూ పరిధిలో గల పొలాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.ఈ రీసర్వేకు అవసరమైన వివరాలు అందించేందుకు భూ యజమానులు సహకరించాలని కోరారు. చందోలు-3 ఎంపీటీసీ సభ్యులు చల్లాపల్లి విజయరాజు, గ్రామ కార్యదర్శులు శేషగిరిరావు, వీరేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు ఉన్నారు.

రేపు విద్యార్థులకు డిబెట్ పోటీలు

రేపల్లె రూరల్: పట్టణంలోని విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అహ్మదీయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీచే ఈ నెల 6వతేదీ స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జీవిత చరిత్రపై విద్యార్థులకు డిబెట్ పోటీలు నిర్వహించబడునని వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ తాహేర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను జనవరి 23న పార్లమెంట్‌లో నిర్వహించే ఈవెంట్‌లో పాల్గొనటానికి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారన్నారు. పూర్తి వివరాలకు 82974 49394 నంబరులో సంప్రదించాలని కోరారు.

తై బాక్సింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన ఐలవరం విద్యార్థులు



ఐలవరం(భట్టిప్రోలు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాల స్థాయిలో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తై బాక్సింగ్‌లో ఐలవరం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్-17 విభాగంలో 10వ తరగతి చదువుచున్న ఎం. మల్లిఖార్జున, 8వ తరగతి చదువుతున్న జి.సీతారామ సందీప్‌లు జిల్లాస్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 21వ తేదీన వైఎస్సార్ కడప జిల్లా రైల్వే కోడూరులోని జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించనున్న పోటీలలో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం కాటూరు లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పెన్షన్ల అమలుతీరుపై సర్వే



వేమూరు: వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్న పెన్షన్ అమలు విధానంపై సర్వే చేయడం జరుగుతుందని నేషనల్ ఇనిస్టూట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ రిసోర్సు పర్సన్ కిరణ్ దేవ్ తెలిపారు. అధికారుల ఆదేశాలు మేరకు బుధవారం వేమూరు మండలంలోని వేమూరు, చదలవాడ, పెరవలి, చావలి గ్రామాల్లో పింఛనులు సర్వే చేయడం జరిగిందని ఆయన చెప్పారు. వలంటీర్ల వ్యవస్థ వల్ల వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు సక్రమంగా అందజేస్తున్నారని ఆయన తెలిపారు. రమేష్, రవి, క్రాంతి, రాజేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రేపల్లె: ప్రమాదరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్ అన్నారు. పెనుమూడి రహదారిలో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ఆటోలలో పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణీకులను ఎక్కించటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సమయంలో ఇటువంటి సంఘటనలు కనిపిస్తున్నాయన్నారు. అధిక లోడులతో ఆటోలు ప్రయాణించరాదన్నారు. ఆటోలలో డ్రైవర్‌కి పక్కన ఉన్న సీట్లపై ప్రయాణికులు కూర్చోరాదని సూచించారు. ఆటో డ్రైవర్‌లు తమ లైసెన్స్‌లు, బండి కాగితాలను నిరంతరం తమ వద్దనే అందుబాటులో ఉంచాలని, డ్రైవర్ ఫోన్ నంబరును ప్రయాణికులకు కనపడేవిధంగా స్టిక్కరింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ద్విచక్రవాహన చోదకులు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు వాటిల్లవన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో కొత్త కాంతులు



నిజాంపట్నంలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



బాపట్లలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

- దశలవారీగా పింఛన్లు పెంచి ఇస్తున్న సీఎం వైఎస్ జగన్
- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులందరికీ దశలవారీగా పెన్షన్‌ను పెంచుకుంటూ పోతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా నిజాంపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో బుధవారం పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. పేద ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం దశలవారీగా పెన్షన్‌ను పెంచుకుంటూ పోవడం జరుగుతుందన్నారు. అవ్వా తాతలకు, దివ్యాంగులకు, కల్లుగీత కార్మికులకు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ పెంచి అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రూ.2500ను రూ.2750కు పెంచి అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నిలకు ముందు ఇచ్చిన హామీలలో 95 శాతంకు పైగా అమలు పరిచారని తెలిపారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును తెలుసుకుంటుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు.రానున్న రోజుల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో నూతనంగా మంజూరైన పెన్షన్‌లను ఎంపీ మోపిదేవి చేతులమీదగా పంపిణీ చేశారు. ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, మోపిదేవి హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, యార్లగడ్డ మదన్‌మోహన్, నాజర్‌ఖాన్, ఎంపీడీఓ నాగలక్ష్మి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...



చెరుకుపల్లిలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ కానుక పెంచి ఇస్తూ నిరుపేదల కళ్లల్లో కొత్త కాంతులు నింపారని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మోపిదేవి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ కొత్త సంవత్సరం ఒకటో తేది నుంచి పండుగ వాతావరణంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పొద్దు పొడవక ముందే ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని మోపిదేవి పిలుపునిచ్చారు. ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, జడ్పీటీసీ, పార్టీ మండల కన్వీనర్ దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు పైనం రంగారెడ్డి, కొత్తపల్లి సుమలత, ఫారూక్, నాయకులు చీరాల ప్రసాద్‌రెడ్డి, పైనం ఏడుకొండలు రెడ్డి, అబ్దుల్ సమ్మద్, చెన్ను కోటేశ్వరరావు, బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో...

నగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మానవతావాది అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన నూతన ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో అమలుకాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. మన రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.2750 పింఛన్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరం మండలంలో గత ప్రభుత్వంలో 6500 పింఛన్‌లు ఇవ్వగా ఇప్పుడు 9120 మందికి ఇస్తున్నట్లు వెల్లడించారు. నూతనంగా 367 మందికి పింఛన్‌లు అందిస్తున్నామన్నారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జడ్పీటీసీ మాన్యం నాగమణి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.రాధారమణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే కోన

బాపట్ల అర్బన్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో పట్టణ, మండల పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పెన్షన్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కోన రఘుపతి మాట్లాడుతూ గత తెలుగుదేశం పార్టీ పాలనలో పెన్షన్ మంజూరు కావాలంటే కార్యాలయాలు చుట్టు తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు వైఎస్సార్ సీపీ పాలనలో నేరుగా ప్రతి నెల ఒకటోతేదిన లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి వలంటీర్లు అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పట్టించుకోని చంద్రబాబునాయుడు ఒక పక్కన, అసలు సమస్యలే తెలియని పవన్ కల్యాణ్ మరో వైపు నిత్యం సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రానున్న కాలంలో వారిద్దరినీ శాశ్వతంగా ఇంటికే పరిమితం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసమావేశంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు నరాలశెట్టి ప్రకాశరరావు, కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, జడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరురాణి, ఎంపీడీఓ రాధాకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని సూర్యలంక, హనుమంత్‌నగర్, ఆదర్శనగర్‌లలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించిన సాయాన్ని వివరించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మత్స్యకారులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. మత్స్యకారులకు ఉపాధి కల్పనకు ప్రత్యేక శ్రద్ధతీసుకుందని తెలిపారు. సూర్యలంకలో స్మశాన వాటిక కోసం స్థలం, సిమెంటు రోడ్లు నిర్మాణం, విద్యుత్ స్తంభాల కొరతను పరిష్కారిస్తానని చెప్పారు. హనుమంతునగర్‌లో ప్రధాన సమస్యగా ఉన్న స్మశానవాటిక సమస్య పరిష్కారిస్తామని కోన చెప్పారు. స్థానికంగా స్మశానవాటికకు వెళ్లే బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మత్స్యశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, పార్టీ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, ఎంపీడీఓ రాధాకృష్ణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల జాబితాను అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

మధ్యాహ్న భోజనం పరిశీలన...

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. భోజనాన్ని విద్యార్థులతో కలిసిభోజనం చేశారు. మధ్యాహ్నభోజనం నిర్వహణ సంతృప్తికరంగా ఉందని ఎమ్మెల్యే కోన చెప్పారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు మృతి



కొల్లూరు: అనారోగ్య బాధలు తాళలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం తెల్లవారుజామును చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని సుగ్గునలంకకు చెందిన గోన నాగేశ్వరమ్మ (61) తన కుమారుడితో కలసి జీవిస్తుంది. గత కొన్నేళ్లగా దీర్ఘకాలిక జబ్బులు, కడుపు నొప్పి సమస్యలతో సతమతమవుతూ రోగ నివారణకు మందులు వాడుతుంది. జబ్బులు నయమవకపోగా, కడుపు నొప్పి వేధిస్తుండటంతో మంగళవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో కూల్‌డ్రింక్‌లో పొలంలో చల్లే గుళికలు కలుపుకొని తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. సమీపంలో నివసించే ఆమె బంధువులు గమనించి, కుటుంబ సభ్యులతో కలసి హుటాహుటిన తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం తెనాలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రేపు రామేశ్వరాలయంలో శివముక్కోటి

తెనాలి: జంగమదేవర అన్నదాన సమాజం, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన సంస్థ 38వ వార్షికోత్సవాలు, స్థానిక శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర మహోత్సవం (శివముక్కోటి) జరగనున్నాయి. ఆరోజు ఉదయం 9 గంటలకు స్వామివారి ఆలయ ప్రదక్షిణలు ఉంటాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు జంగమదేవరలకు (మహేశ్వరులకు) అన్నదాన సమారాధన, వస్త్రదానం ఉంటాయని సమాజం అధ్యక్షుడు మేడా బదిరినారాయణరావు, కార్యదర్శి పీవీ సుబ్బారావు వెల్లడించారు. కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి రమణకుమారి, సమాజం కోశాధికారి వుప్పల వరదరాజులు, ఉపాధ్యక్షుడు వేమూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పెండేల సుబ్బారావు, కార్యవర్గసభ్యులు యక్కల మాల్యాద్రి, జంధ్యాల సుబ్రహ్మణ్యం, పెనుమూడి పవన్‌కుమార్ పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన బదరీనారాయణ, రమణకుమారి

పాలిథిన్ వినియోగాన్ని నివారించాలి

మున్సిపల్ కమిషనర్ విజయసారథి

రేపల్లె రూరల్: ప్లాస్టిక్ వినియోగాగ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగిపోయేందుకు అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు భూమిలో కలిసేందుకు చాలా సమయం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్, పాల్థిన్ కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను గన్నీ బ్యాగ్‌లు, గుడ్డ సంచులు వినియోగించాలన్నారు. పాలిథిన్, ప్లాస్టిక్ పదార్థాలను విక్రయాలకు పాల్పడినా, వినియోగించినా జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.

మాస్టర్ అథ్లెటిక్ సీతారామమూర్తికి సత్కారం

తెనాలిటౌన్: పట్టణ ఐతానగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, జాతీయస్థాయి క్రీడాకారుడు దీవి సీతారామమూర్తిని బుధవారం కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో నాయకులు సత్కరించారు. ఇటీవల నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన 41వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో 65 సంవత్సరాల విభాగంలో పాల్గొని లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లలో రెండు బంగారు పతకాలు సాధించడం జరిగింది. ఈ సందర్భగా అసోసియేషన్ నాయకులు సీతారామమూర్తిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణమూర్తి, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, హృదయరాజు, విశ్రాంత హెచ్‌ఎం పినపాటి రవికుమార్ పాల్గొన్నారు.



సీతారామమూర్తిని సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని జీఆర్పీ పోలీసులు బుధవారం గుర్తించారు. తెనాలి రైల్వేస్టేషన్‌లోని మూడో నంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న వెయిటింగ్ హాలు వద్ద సుమారు 70 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు తెల్ల బనియన్, ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. జీఆర్పీ ఎస్ఐ ఎల్.సరస్వతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీల రాకపోకలపై ఆంక్షలు సడలింపు

తెనాలిరూరల్: పట్టణంలోకి లారీల రాకపోకలపై ఆంక్షలను సడలించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ జె.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లారీలు ఉదయం ఎనిమిది గంటల్లోపు పట్టణంలోకి వచ్చి తొమ్మిది గంటలకు బయటకు వెళ్లిపోవాలని, మధ్యాహ్నం ఒటి గంట నుంచి మూడు గంటల వరకు రావచ్చని, రాత్రి 8.30 గంటల తర్వాతే లారీలను పట్టణంలోకి అనుమతిస్తామన్నారు. కొత్త ఆంక్షలు గురువారం నుంచి అమల్లోకి వస్తాయన్నారు. వ్యాపారులు గమనించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సహకరించాలని కోరారు.

లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు



విభిన్న ప్రతిభావంతులను సత్కరిస్తున్న ఎన్‌ఆర్ఐ నీలా సతీష్, ఐఈడీ టీచర్లు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నాన్ భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతుల మధ్య బుధవారం లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా మండలంలోని పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంకు చెందిన ఎన్‌ఆర్ఐ నీలా సతీష్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులతో ఈ జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం భారతుల శ్రీధర్, ఐఈడీ టీచర్లు, డి.మేరీ ఇవాంజిలిన్, కె.రత్నాకర్‌లు లూయిబ్రెయిలీ గూర్చి విద్యార్థులకు తెలియచేశారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు జీసీ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుచున్న విద్యార్థి కేతావత్ సాంబశివరావు నాయక్‌ను పరామర్శించి, విద్యాప్రగతిని తెలుసుకున్నారు. ఈ విద్యార్థికి గత రెండేళ్లల్లో రెండు సార్లు కంటికి సంబంధించిన వైద్యం అందించినట్లు తెలిపారు. ఎన్ఆర్ఐ సతీష్ చిన్నారులకు డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ పెన్సిల్స్ అందించారు. తొలుత చిన్నారులు క్యాండిల్స్ వెలిగించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్, ఎం.శరత్, సీఆర్పీ కె.సలోమి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు హైస్కూల్‌లో...

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో సర్ ఐజ్యాక్ న్యూటన్, లూయి బ్రెయిలీల జయంతి వేడుకలు బుధవారం విద్యార్థుల సమక్షంలో హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు నిర్వహించారు. శాస్త్రవేత్తలు న్యూటన్ మూడు నియమాల కనుగొన్న విధానం, ఉపయోగం, బ్రెయిలీ లిపి కనుగొన్న విధానం అంధులకు దానివల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కరస్పాండెంట్ పి.మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, కోటేశ్వరమ్మ, మురళీధరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా జయంతి వార్షికోత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా వారి ఆలయంలో నిర్వహిస్తున్న 78వ జయంతి వార్షికోత్సవాలలో భాగంగా బుధవారం తెల్లవారుజామున ఓంకారం, నగర సంకీర్తన, సుప్రభాతం, కాకడ హారతి నిర్వహించారు. శ్రీ సాయినాథుని పాదుకలకు అభిషేకాలు, సాయినాథుడికి నాగవల్లి దళాలతో సహస్ర నామార్చన చేశారు. సాధన మండలి, బ్రహ్మ విద్యాశ్రమం వారిచే నారాయణోపనిషత్తు, భజ గోవిందం, గీతా పారాయణం, తత్వసారం జరిగింది. అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో షిర్డీసాయి బాబా వారి జీవిత చరిత్రలోని కొన్ని అంశాలు, వెంకటేశ్వర స్వామివారి సంబంధిత అంశాలపై ప్రవచనంతో స్తోత్రాలు,స్తుతులు, గేయాలు ఆలపించారు. సాయంత్రం సంధ్యాహారతి, అష్టోత్తర పూజలు రాత్రి శేజాహారతి, ఊయల, పవళింపు సేవలు జరిగాయి. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి బాలకృష్ణమూర్తి, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్‌లు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకారంలో షిర్డీ సాయిబాబా

అయ్యప్ప ఆలయంలో విశేష పూజలు



భక్తులకు అన్నదానం

కర్లపాలెం: మహాశాస్త్ర స్వామి అయ్యప్ప ఆలయంలో గత 44రోజులుగా జరుగుతున్న అన్నదాన కార్యక్రమం బుధవారం ముగిసింది. అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కర్లపాలెంలో అయ్యప్పస్వామి ఆలయాన్ని 18 సంవత్సరాల క్రితం నిర్మించి జనవరి 4వ తేదీన విగ్రహ ప్రతిష్ట చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయంలో 41రోజుల పాటు అయ్యప్పస్వామి వారి అభిషేకాలు, అర్చనలు, పడిపూజలు నిర్వహిస్తూ అయ్యప్ప మాలధారణ స్వాములకు చద్దిపంపిణీ చేస్తున్నారు. గత సంవత్సరం నవంబర్ నెలలో మొదలైన చద్ది పంపిణీ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈసందర్భంగా దాతల సహకారంతో స్వామివారి ఆలయ ప్రాంగణంలో జరిగిన మహా అన్నదాన కార్యక్రమంలో సుమారుగా 4వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరాజు, దత్తాత్రేయులు, వెంకటనారాయణ, సుబ్బారావు, వేణు, గిరి, శ్రీనివాసరావు, ఏడుకొండలు, కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.



కర్లపాలెంలో పూజలందుకున్న అయ్యప్ప స్వామి

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఖాజీపాలెం విద్యార్థిని

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం): మండలంలోని ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థిని మన్యం లీలా ప్రవళిక జాతీయస్థాయి అథ్లెటిక్స్ అండర్-16 విభాగంలో జరగనున్న పోటీలకు ఎంపికైనందున బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆబాలికను అభినందించి రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈసందర్భంగా కళాశాల హెచ్‌ఎం బెజ్జం పద్మారావు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీ, హెచ్‌ఎంలు కలిపి మరో రూ.11వేలు ఆమెకు అందజేశారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. గ్రామసర్పంచి కుంతం అనూషప్రసన్నరాజు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గుమ్మడి సీతయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారిణికి అభినందన...

కర్లపాలెం: స్విమ్మింగ్ పోటీలలో మరిన్ని విజయాలు సాధించి బాపట్లకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కోన రఘుపతి స్విమ్మింగ్ క్రీడాకారిణి లాస్యశ్రీకి తెలిపారు. కేరళ రాష్ట్రంలో ఇటీవల జరిగిన సౌత్ ఇండియా స్విమ్మింగ్ పోటీలలో కర్లపాలెంలో పేరలి గ్రామానికి చెందిన కాగిత లాస్యశ్రీ ఓవరాల్ చాపింయన్‌షిప్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి తనను కలిసిన లాస్యశ్రీని అభినందించారు. గతంలో జరిగిన పలు స్విమ్మింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించటం అభినందనీయమని కోన తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరలి సర్పంచి మల్లెల వెంకటేశ్వర్లు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ ధర్మేంద్ర, కాగిత వెంకయ్య తదితరులు ఉన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కొనసాగుతున్న వ్రత పూజామహోత్సవాలు

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని విద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామీజీ పర్యవేక్షణలో జరుగుతున్న శ్రీ ధనుర్మాస వ్రతపూజామహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రతినిత్యం మేలుకొలుపు గోదారంగనాథులకు సాలిగ్రామాన అభిషేకాలు చేస్తున్నారు. గోదారంగనాథులకు అష్టోత్తర శతనామార్చాన, ఆరగింపు, తిరుప్పావై గోష్ఠి జరిపారు. ధనుర్మాస వ్రత విశిష్టతను బాలస్వామీజీ భక్తులకు వివరించారు. ఉభయదాతలు చుండూరు లోకనాథం, వరలక్ష్మి దంపతులు, చంతలచెరువు శ్రీనివాసరెడ్డి, లక్ష్మీతిరుపతమ్మ దంపతులు పూజలు నిర్వహించారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, శ్రీవిద్యాపీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో స్వామి, అమ్మవార్లు